సాక్షి
తిరుపతి
గురువారం । 10 । జూలై । 2025



బంగారుపాళెం వద్ద మామిడి కాయలు చేతబట్టి మాజీ సీఎం వైఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న రైతులు, అభిమానులు

ఆంక్షలు దాటిన అభిమానం!





మామిడికి మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి

అలవి కాని ఆంక్షలు.. అడుగడుగునా అడ్డంకులు.. జననేత అభిమానులెవ్వరూ బంగారుపాళెం వెళ్లకుండా ఖాకీల కుయుక్తులు.. ఎక్కడికక్కడ చెక్ పోస్టులు. బస్సుల్లోనూ ముమ్మరంగా తనిఖీలు.. రోడ్లపై రాత్రికిరాత్రే వెలిసిన బారికేడ్లు.. ద్విచక్ర వాహనదారులకూ తప్పని తిప్పలు.. పాద చారులకూ తీవ్ర ఇక్కట్లు.. ఊర్లకెళ్లే అక్కచెల్లెమ్మలకు అవమానాలు.. రైతులు కనిపిస్తే చెలరేగిపోయిన పోలీసులు.. అధికార అండతో లాఠీలు ఝళిపించిన రక్షక భటులు.. తలలు పగులగొట్టి రక్తగాయాలు.. ఇదీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బంగారుపాళెం పర్యటనలో కనిపించిన దృశ్యాలు. ధర లేక దగాపడ్డ మామిడి రైతులకు అండగా నిలిచేందుకు విచ్చేసిన వైఎస్సార్‌సీపీ అధినేతను అడ్డుకునేందుకు కూటమి నేతలు కుతంత్రాలు పన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని ఆంక్షల చట్రానికి తెరలేపారు. హెలిప్యాడ్ నుంచి బంగారుపాళెం మార్కెట్ యార్డు వరకు అభిమానులెవ్వరూ లేకుండా చేయాలని పన్నాగం పన్నారు. కానీ వారి కుట్రలు భగ్నం చేస్తూ రైతులు సునామీలా దూసుకొచ్చారు. ఆంక్షల కంచెను అధిగమించి పోటెత్తారు. కొండలు, గుట్టలు దాటుకుని జననేతను చూసి మురిసిపోయారు. తమకు మద్దతుగా నిలిచినందుకు కృతజ్ఞతాభివందనాలు తెలియజేశారు.

బంగారుపాళెంలో జన సునామీ

- కూటమి కుయుక్తులు.. ఆంక్షల కంచె పటాపంచలు
- అభిమాన నేతను చూసి మురిసిపోయిన అక్కచెల్లెమ్మలు
- మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటన విజయవంతం



అశేష జనవాహిని మధ్య బంగారుపాళెం మామిడికాయల మార్కెట్ యార్డుకు తరలివస్తున్న వైఎస్‌.జగన్

చిత్తూరు అర్బన్/ కాణిపాకం/ పలమనేరు/ బంగారుపాళెం: ఒకే ఒక వ్యక్తిని అడ్డుకోవడానికి వందలాది మంది ఖాకీలు. కానీ వేలాది మంది అభిమానం ముందు ఎవ్వరూ నిలబడలేకపోయారు. చివరకు ఏ సంబంధం లేని సామాన్యులను సైతం అడ్డుకున్నారు. అడగుడగునా ఆంక్షల చట్రం విధించినా ఏ మాత్రం అవి పనిచేయ లేదు. మామిడి రైతులను పరామర్శించడానికి బుధవారం బంగారుపాళెంకు వచ్చిన మాజీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన దిగ్విజయంగా ముగిసింది.

రెడ్‌జోన్‌గా బంగారుపాళెం

వాహనాల్లో బంగారుపాళెంకు వెళుతున్న పలువురు నాయకులను మహాసముద్రం టోల్‌గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. పార్టీ నేతలందర్నీ అదుపులోకి తీసుకుని చిత్తూరులోని జిల్లా పోలీసు శిక్షణా కేంద్రానికి తరలించారు. అసలు ఏ బస్సు కూడా బంగారుపాళెం లోపలకు వెళ్లకూడదని, జాతీయ రహదారి మీదుగా కూడా వెళ్లకూడదని హుకూం జారీ చేశారు. బంగారుపాళెం బస్సు టికెట్లే ఇవ్వలేదు. పలమనేరు టికెట్లు కొనుక్కున్న ప్రయాణికులు హైవేల వైపు దిగి కిలో మీటర్ల కొద్దీ నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మహాసముద్రం టోల్ గేటు వద్ద బస్సుల్లోకి ఎక్కిన పోలీసులు ఎవరైనా బంగారుపాళెంకు వెళుతున్నారా..? అని అడుగుతూ.. వెళుతున్నామంటే ప్రయాణికులను సైతం అదుపులోకి తీసుకున్నారు. టోల్ గేటు వద్ద దించేశారు.

పలుచోట్ల లాఠీ చార్జ్

వైఎస్‌.జగన్‌ను చూడడానికి పలుచోట్ల ప్రజలు రోడ్లకు ఇరువైపులా నిలబడ్డారు. వీళ్లను తరమివేయడానికి పోలీసులు గట్టిగానే ప్రయత్నించారు. చాలా చోట్ల ప్రజలు పోలీసుల మాటల్ని లెక్కచేయకపోవడంతో లాఠీలతో చావ బాదారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సామాన్యులు సైతం గాయపడ్డారు. మరికొన్ని చోట్ల ప్రజల్ని నెట్టేయడంతో తోపులాటకు కింద పడిపోయారు.

నాయకులపై జులుం

వైఎస్సార్‌సీపీ నాయకులపై చాలా చోట్ల పోలీసులు జులుం ప్రదర్శించారు. మాజీ ఎంపీ రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యేలు డా.సునీల్, వెంకటేగౌడ, చిత్తూరు సమన్వయకర్త విజయానందరెడ్డి తమ కార్యకర్తలతో హెలిప్యాడ్ వద్దకు వెళుతుంటే పోలీసులు అడ్డుకున్నారు. తాను మాజీ ఎంపీ అని రెడ్డెప్ప చెబుతున్నా పట్టించుకోలేదు. దీంతో కొద్దిసేపు పోలీసులకు, వైఎస్సార్‌సీపీ నాయకులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కార్యక్రమంలో మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నారాయణస్వామి, ఆర్కే రోజా, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్, మాజీ ఎంపీ రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యేలు సునీల్‌కుమార్, వెంకటగౌడ్, బియ్యపు మధుసూదన్ రెడ్డి, నియోజవర్గ సమన్వయకర్తలు విజయానంద రెడ్డి, భూమన అభినయరెడ్డి, కృపాలక్ష్మి, ఉమ్మడి జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ జిల్లా నేతల సమాలోచనలు

బంగారుపాళెంలో జగన్ జాతర

మాజీ సీఎం వైఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన జన జాతరను తలపించింది. బంగారుపాళెం చుట్టూ పోలీసులు విధించిన ఆంక్షలు పటాపంచలయ్యాయి. పోలీసుల అడ్డగింతలు, నోటీసులతో జనం ఉలిక్కిపడ్డారని అధికార పక్షం, అధికారులు అనుకున్నారు. మార్కెట్ ప్రాంగణం, రోడ్డు మార్గంలో జనం పలుచగా ఉన్నారని తెగ సంబరపడ్డారు. ఆ తర్వాత ప్రజలు భారీ స్థాయిలో తరలివచ్చారు. వీరి రాకతో మార్కెట్ ప్రాంతమంతా నిండిపోయింది.

కర్ణాటక సరిహద్దు నుంచి ఆంక్షలు

బంగారుపాళెంకు జనం వెళ్లకుండా పోలీసులు కర్ణాటక సరిహద్దుల్లోని గంగవరం మండలం, కుప్పం ప్రాంతంలో వీకోట, బైరెడ్డిపల్లి, జాతీయ రహదారిలో గాంధీనగర్ వద్ద భారీగా మోహరించారు. బంగారుపాళెంకు వెళ్లే గ్రామీణ రహదారులను సైతం పోలీసులు దిగ్బంధం చేశారు.



జగన్‌కు స్వాగతం పలుకుతున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



స్వాగతం పలుకుతున్న భూమన కరుణాకరరెడ్డి



జగన్‌తో భూమన అభినయ్



స్వాగతం పలుకుతున్న విజయానందరెడ్డి



స్వాగతం పలుకుతున్న హరిప్రసాద్‌రెడ్డి



ఉప్పొంగిన అభిమానం



రోడ్డుకిరువైపులా క్యూకట్టిన అభిమానులు



ఈల వేసి.. గోలచేసి!



ఆంక్షలతో ఆగ్రహించిన అధినేత వైఎస్‌.జగన్, ఇతర నేతలు



నువ్వే రావాలి అన్నా!



జై జగనన్నా!

న్యూస్‌రీల్

పోలీసుల ఓవర్‌యాక్షన్!



మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడతో వాగ్వాదం

పలమనేరు: పోలీసులు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బంగారుపాళెం పర్యటనలో ఎక్కడాలేని ఆంక్షలు పెట్టి ఓవర్‌యాక్షన్ చేశారు. పలమనేరు వైపు నుంచి ద్విచక్ర వాహనాలను సైతం పంపకుండా పట్టణ సమీపంలోని గాంధీనగర్ వద్ద అడ్డుకున్నారు. ఇదే సమయంలో అక్కడికి చేరుకున్న పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ వాహనాన్ని ఆపారు. ఆపై మాజీ ఎమ్మెల్యే అని కూడా చూడకుండా దురుసుగా మాట్లాడడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ఆపై అక్కడున్న వారిని పోలీసులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటకు పంపారు.

పోలీసుల జులుం



లాఠీలతో జనాన్ని తరుముతున్న పోలీసులు

పలమనేరు, కుప్పం, పుంగనూరు ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు బంగారుపాళెం ఫ్లైఓవర్ నుంచి కాలినడకన వెళ్తుండగా అక్కడున్న పోలీసులు జనంపై లాఠీలతో విరుచుకుపడ్డారు. వైఎస్సార్‌సీపీ నేతలు సర్దిచెబుతున్నా లెక్కచేయలేదు. ఒకానొక సందర్భంలో పోలీసులపై ప్రజలు తిరగబడాల్సి వచ్చింది. ఎటూ చూసినా జనాన్ని చూసిన పోలీసులు శత్రువులును చూసినట్టుగా అడ్డుకోవడం విమర్శలకు తావిచ్చింది. పోలీసుల కవ్వింపుల కారణంగానే ప్రజలు మరింత ఆగ్రహానికి గురయ్యారు.

బైక్‌ల తాళాలు లాక్కునీ..

రోడ్డుపై బైకులో వస్తున్న వందలాది మందిని పోలీసులు అడ్డుకున్నారు. తాము స్థానికులమని చెబుతున్నా ఎవ్వరూ పట్టించుకోలేదు. వారి బైక్ కీలను లాక్కొన్నారు. దీంతో జనం ఆగ్రహానికి గురయ్యారు. వైఎస్ జగన్ పర్యటక ముగిశాక సైతం మార్కెట్ నుంచి జనం బయటకు వెళ్లకుండా పోలీసులు గేట్లను వేసేశారు. దీంతో భయపడిన జనం గోడలు, గేట్లు దూకి బయటకు వెళ్లాల్సి వచ్చింది.

సీఎం.. డౌన్‌డౌన్



మార్కెట్ గేటు ఎక్కి లోపలికి వెళుతున్న అభిమానులు

కాణిపాకం: బంగారుపాళెం మామిడి కాయల మార్కెట్ గేటు ఎదుట బుధవారం ఉదయం 10.30గంటల ప్రాంతంలో రైతులు, జగనన్న అభిమానులు రెండో గేటు ఎదుట ఆగ్రహానికి గురయ్యారు. లోపాలికి పంపాలని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పట్టించుకోని పోలీసులతో విసిగిపోయిన వారు సీఎం డౌన్..సీఎం డౌన్‌డౌన్ అంటూ నినాదాలు మిన్నంటించారు. ఆపై ఒక్కసారిగా వారంతా మొదటి గేటులో నుంచి మార్కెట్ లోపలకి దూసుకొచ్చారు. కొందరు మార్కెట్ ప్రహరీ గోడను ఎక్కి లోపలికి తరలివచ్చారు.

చిన్నారి పులకింత

కాణిపాకం: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటనలో ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు ఎన్ని ఆంక్షలు విధించినా వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు, స్థానికులతో పాటు వృద్ధులు, చిన్నారులు కూడా వైఎస్ జగన్‌ను చూసేందుకు తరలి వచ్చారు. అందులో భాగంగా ఓ (చిత్తూరుకు చెందిన హోమ శైలుషా 7వ తరగతి) చిన్నారి తన భామతో కలిసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు రోడ్డుపై వేచి ఉంది. వీరిని గమనించిన జగన్‌మోహన్‌రెడ్డి తన కాన్వాయ్‌ని ఆపి వారిని దగ్గరకు పిలిచారు. ఆప్యాయంగా పలకరించారు. దీంతో వారిద్దరూ ఆనందంలో మునిగితేలారు.



విచక్షణారహితంగా లాఠీచార్జ్



ఎక్కడికక్కడ కట్టడి



మహిళలనీ చూడకుండా..!



అడుగడుగునా ఆంక్షలు



మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌ను అడ్డుకుంటున్న పోలీసులు



పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు

క్లుప్తంగా

అనుమతి లేదంటూ అరెస్టు



పోలీసుల అదుపులో వైఎస్సార్‌సీపీ నేత చిందేపల్లి

పెళ్లకూరు : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం మామిడి సాగు రైతుల పరామర్శకు జిల్లాకు వచ్చిన సందర్భంగా హాజరయ్యేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి పుల్లూరు నుంచి వెళుతుండగా మార్గమధ్యలో రెడ్డిగుంట వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మామిడి రైతుల పరామర్శ కార్యక్రమానికి ఇతర ప్రాంతాల వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొనేందుకు అనుమతి లేదంటూ చిందేపల్లిని అరెస్టు చేసి ఆయన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

చిగరపల్లి బడిని కొనసాగించాలి



పాఠశాల వద్ద తల్లిదండ్రుల నిరసన

పాకాల : మండలంలోని చిగరపల్లి ఎంపీపీ పాఠశాలను గతంలో మాదిరిగానే కొనసాగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. తమ గ్రామంలో పాఠశాలను 5వ తరగతి వరకు కొనసాగించాలని, పాఠశాలను విలీనం చేయడంతో సుమారు 4 కిలో మీటర్లు నడిచి వెళ్లాలని ఆవేదన వ్యక్తం చేశారు. మా గ్రామంలోని పాఠశాలలో 5వ తరగతి వరకు, గతంలో నిర్వహించిన మాదిరిగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు మమత, ఝాన్సీ, గౌరి, మీన, జ్యోతి, పుష్ప, సుబ్రమణ్యం, శిరీష, శ్రీనివాసులు, గోపి, కుమార్, మంజునా థ్, విశ్వనాథ్, హేమలత, ధనమ్మ, ధనలక్ష్మి, చిట్టి పాల్గొన్నారు.

లాఠీ కాఠిన్యం..
రక్తమోడినా తరగని అభిమానం

- అభిమాననేత కోసం వెళ్లిన అతడిపై లాఠీ చార్జ్
- తలపగిలి రక్తం కారుతున్నా లెక్క చేయని వైనం
- పోలీసుల దుశ్చర్యపై అధినేత ఆగ్రహం



పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో శశిధర్ రెడ్డి తలకు తీవ్రగాయమైన దృశ్యం



ఇటీవల జరిగిన ఓ సమావేశంలో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన శశిధర్‌రెడ్డి

సాక్షి, టాస్క్‌ఫోర్స్: తిరుపతి రూరల్ మండలం లింగేశ్వరనగర్ పంచాయతీకి చెందిన రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం కార్యదర్శి శశిధర్‌రెడ్డికి వైఎస్ఆర్ అన్నా.. ఆ కుటుంబమన్నా అతనికి ప్రాణం.. మహానేత రాజశేఖరరెడ్డి జయంతి అయినా.. వర్ధంతి అయినా.. పది మందికీ అన్నం పెడతాడు; రక్తదానం చేసి తన అభిమానాన్ని చాటుకుంటాడు.. జననేత జగనన్న అంటే అతనికి మహా ఇష్టం.. రాజన్న బిడ్డగానే కాదు.. తన అభిమాన నాయకునిగా గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న అతడు అభిమాననేత పర్యటనకు ఉత్సాహంగా వెళ్లాడు. అయితే అడుగడుగునా పోలీసుల అవరోధాలు, ఆంక్షలు అధిగమించి వెళ్లిన అతడిపై పోలీసులు తమ ప్రతాపం చూపారు. లాఠీచార్జ్ చేసి తల పగగొట్టారు. వివరాలు..మామిడి రైతుల కష్టాలు తెలుసుకుని గిట్టుబాటు ధర కల్పించలేని ప్రభుత్వాన్ని నిలదీయడానికి బంగారుపాళెంకు బుధవారం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వస్తున్నారని తెలుసుకుని శశిధర్‌రెడ్డి అక్కడికి వెళ్లాడు. ఉదయం 5 గంటలకే తిరుపతి నుంచి బయలుదేరి పోలీసుల ఆంక్షలన్నీ అధిగమించి బంగారుపాళెం వెళ్లిన శశిధర్‌రెడ్డి అక్కడకు వచ్చిన వేలాది మంది జనంలో ఒక్కడిగా జగనన్న రాక కోసం వేచి చూస్తున్నాడు. ఇంతలో జగనన్న కాన్వాయ్ వస్తుండగా జనం తోపులాటలో తాను దగ్గరకు వెళ్లి కళ్లారా జగనన్నను చూడాలని తపించాడు. దీంతో అక్కడే ఉన్న పోలీసులు తమ చేతిలోని లాఠీలకు పనిచెప్పారు. రాక్షసత్వంగా వ్యవహరించి తలపై లాఠీలతో బలంగా కొట్టారు. ఆ లాఠీ దెబ్బకు తలపగిలిన శశిధర్‌రెడ్డి ముఖంపై రక్తం కారుతున్నా లెక్క చేయకుండా అలాగే ముందుకొచ్చాడు.. ఇది చూసి జగనన్న చలించిపోయారు. కాన్వాయ్ దిగి అతని వద్దకు వచ్చే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. గాయపడ్డ శశిధర్‌రెడ్డిని దగ్గరకు తీసుకుని తలకు తగిలిన గాయం చూసి మరింత ఆవేదనతో పోలీసుల తీరుపై అక్కడే ఉన్న ఎస్పీ మణికంఠ చందోలుపై మండిపడ్డాడు. తన కోసం వచ్చిన కార్యకర్తల తలలు పగలగొట్టడమేమిటని ప్రశ్నించారు. అనంతరం శశిధర్‌రెడ్డిని ఆసుపత్రికి తరలించాలని స్థానిక నేతలకు సూచించారు. శశిధర్‌రెడ్డి కూడా తన అభిమాన నాయకున్ని చూశానన్న ఆనందంలో తలకు తగిలిన గాయాన్ని లెక్క చేయకపోవడం విశేషం! ఆ తరువాత కొంత సేపటికి అక్కడే ఉన్న అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స అనంతరం అక్కడ నుంచి తిరుపతికి చేరుకున్నాడు.

జగన్ జనాదరణను అడ్డుకోలేరు

- పర్యటనలో అడుగడుగునా రెడ్‌బుక్ రాజ్యాంగం
- వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి

తిరుపతి కల్చరల్ : పంటకు గిట్టుబాటు ధరల్లేక అల్లాడుతూ తీవ్రంగా నష్టపోతున్న మామిడి రైతులను పరామర్శించేందుకు చిత్తూరు జిల్లాలోని బంగారుపాళెం వచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటనలో పోలీసులు అడుగడుగునా అడ్డుకునే చర్యలు రెడ్‌బుక్ రాజ్యాంగానికి నిదర్శనమని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం సాయంత్రం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నష్టపోతున్న మామిడి రైతుల పరామర్శకు మాజీ సీఎం మార్కెట్ యార్డుకు రావడం నేరమా అని ఆయన ప్రశ్నించారు. పర్యటనలో ఎక్కడికక్కడ వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు రాకుండా అడ్డుకోవడమే కాక వారిని దూర ప్రాంతాలకు తరలించి నిర్బంధించడం దుర్మార్గ చర్య అన్నారు. పోలీసులు అప్రజాస్వామికంగా వ్యవహరిస్తూ ఎక్కడికక్కడ నిర్బంధాలకు పూనుకోవడం దారుణమన్నారు. వైఎస్సార్‌సీపీ రైతు సంఘం నేతగా తనతో మరో 30 మందిని జగన్ పర్యటనకు వెళ్లకుండా అడ్డుకొని నిర్బంధించడమే కాక కనీసం మంచి నీళ్లు కూడా ఇవ్వకుండా వ్యవహరించడం చూస్తే పోలీసులు కూటమి ప్రభుత్వం తొత్తులుగా వ్యవహరిస్తున్నారని స్పష్టమవుతోందన్నారు. జగన్ పర్యటనకు వెళ్తే కేసులు పెడతామని, రౌడీషీట్ పెడతామని స్వేచ్ఛను హరించేలా పోలీసులు వ్యవహరించారన్నారు. బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి ఒక అవివేకని విమర్శించారు. కర్ణాటకలో కేంద్ర మంత్రి కేంద్ర సహకారంతో మామిడి కిలో రూ.16 కల్పిస్తే ఆంధ్రాలోని మామిడి రైతులు నష్టపోతున్నా నోరు మెదపక, శ్రీవారి దర్శనాలే ప్రరమావధిగా వ్యవహరించే బీజేపీ నేత పసలేని విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో వైఎస్ఆర్‌సీపీ నేతలు వెంకటేష్‌రెడ్డి, కె.వెంకటాచలం పాల్గొన్నారు.

చెక్ బౌన్స్ కేసులో పోలీస్ అధికారికి జైలు

తిరుపతి లీగల్ : చెక్కు బౌన్స్ కేసులో పోలీసు అధికారి ఎండీ షరీఫ్‌కు ఆరు నెలలు జైలు శిక్ష, 5,000 జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోటేశ్వరరావు బుధవారం తీర్పు చెప్పారు. తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లా బీరంగూడ గ్రామం, భ్రమరాంభిక నగర్‌కు చెందిన విజయ్‌కుమార్ వద్ద తిరుపతి,అరవపల్లి వీధికి చెందిన కళ్యాణి .. పోలీస్ ట్రైనింగ్ సెంటర్ డీఎస్పీగా ఉన్న ఎండీ షరీఫ్ 2015 అక్టోబర్ 29వ తేదీ 20 లక్షల రూపాయలను అప్పుగా తీసుకుని ప్రామిసరీ నోటు రాసి ఇచ్చాడు. ఆ సొమ్ము చెల్లించే క్రమంలో అసలు వడ్డీ కలిపి 49 లక్షలా 80 వేల రూపాయలు విలువ చేసే చెక్కును 2022 ఏప్రిల్ 4వ తేదీన విజయ్ కుమార్‌కు డీఎస్పీ షరీఫ్ ఇచ్చాడు. అతను ఆ చెక్కును బ్యాంకులో వేయగా బౌన్స్ అయింది. దీంతో విజయ్ కుమార్ కోర్టులో డీఎస్పీ షరీఫ్‌పై చెక్కు బౌన్స్ కేసు దాఖలు చేశాడు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి డీఎస్పీ షరీఫ్‌కు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. డీఎస్పీ షరీఫ్ ప్రస్తుతం తిరుపతి ఫారెస్ట్ టాస్క్‌ఫోర్స్ డీఎస్పీగా ఉన్నట్లు సమాచారం.

ఫెలోషిప్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: మహిళా వర్సిటీలోని ఏపీఎస్‌హెచ్‌సీ–ఐబీసీ ప్రాజెక్ట్‌లో భాగంగా మహిళా వర్సిటీ, ఐజర్, ఐఐటీ, ద్రవిడియన్ వర్సిటీల్లో బయోడైవర్సిటీ రిజిస్టర్ల సృష్టి – జీవ వైవిధ్య పరిరక్షణ అనే అంశంపై పనిచేయడానికి తాత్కాలిక ప్రాతిపదికన ప్రాజెక్ట్ ఫెలోషిప్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పరిశోధన ప్రాజెక్ట్ హెడ్ ప్రొఫెసర్ ఎండీ మమత ఒక ప్రకటనలో తెలిపారు. సైన్స్‌లో యూజీ పూర్తి చేసి జీవ వైవిధ్య పరిరక్షణ, నమూనాసేకరణలో అనుభవం ఉన్న మహిళా, పురుషులు ఈ పోస్టుకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 13లోపు దరఖాస్తు చేసుకోవాలని, 14న ఇంటర్వ్యూలు ఉంటాయని తెలియజేశారు. మరిన్ని వివరాలకు మహిళా వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి ఐసెట్ కౌన్సెలింగ్

తిరుపతి సిటీ: ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాల కోసం నిర్వహించన ఐసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానుంది. 14వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగనుండగా, 13వ తేదీ నుంచి 18వరకు వెబ్ ఆప్షన్‌కు అధికారులు అవకాశం కల్పించారు. 19న ఆప్షన్ మార్పుకు వెసులుబాటు కల్పిస్తూ, 22న సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేయనున్నారు. సీట్లు సాధించిన విద్యార్థుల 23 నుంచి 26వ తేదీలోపు తమకు కేటాయించిన కళాశాలలో ప్రవేశం పొందాల్సి ఉంటుంది.

14న నేషనల్ అప్రెంటీస్ మేళా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 14న నేషనల్ అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ రవీంద్రరెడ్డి తెలిపారు. ప్రముఖ కంపెనీల్లో ఉన్న అప్రెంటీస్ షిప్ ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 14న ఉదయం 9 గంటలకు నిర్వహించే ఈ మేళాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో శిక్షణ పూర్తి చేసి ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులు సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు www.apreticeshipindia.gov.inలో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

వైద్య అధ్యాపకులకు శిక్షణ

తిరుపతి తుడా : ఎస్వీ వైద్య కళాశాల మెడికల్ ఎడ్యుకేషన్ విభాగం, తమిళనాడు వేలూరు సీఎంసీ వైద్య కళాశాల అబ్జర్వర్స్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే బేసిక్ కోర్స్ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్ అనే అంశంపై వైద్య అధ్యాపకులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవిప్రభు మాట్లాడుతూ.. నేషనల్ మెడికల్ కమిషన్ ఆదేశాల మేరకు వైద్య అధ్యాపకులకు వైద్య విద్య బోధనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలు గురించి, నూతన వైద్య విద్య బోధనా పద్ధతులపై మూడు రోజుల పాటు శిక్షణ ఉంటుందని, ఇది అధ్యాపకులకు ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జె రాధ, అకాడమిక్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ కిరీటి, వేలూరు సీఎంసీ వైద్యులు డాక్టర్ మీను రేఖ, డాక్టర్ శోభన రాజన్, చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్, డాక్టర్ ఉమాదేవి, వైద్య అధ్యాపకులు పాల్గొన్నారు.

సహకార సంఘాల సేవలు వినియోగించుకోండి



నాగవర్ధిని

తిరుపతి అర్బన్: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (సింగిల్ విండో సొసైటీలు)సేవలను రైతులతోపాటు అంతా సద్వినియోగం చేసుకోవాలని ఆ విభాగానికి చెందిన జిల్లా అధికారిణి నాగవర్ధిని పేర్కొన్నారు. ఇటీవల చిత్తూరు నుంచి బదిలీపై తిరుపతి జిల్లాకు విచ్చేసిన ఆమె బుధవారం కలెక్టరేట్‌లోని తమ చాంబర్ నుంచి మాట్లాడారు. సహకార సంఘాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రధానంగా సొసైటీల ఆధ్వర్యంలో జిల్లాలో 8 పెట్రోల్ బంకులు త్వరలో అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో తంగేళ్లపాళెం, కాయంపేట, సత్యవేడు, ఎర్రావారిపాళెం, వెంకటగిరి, చిట్టమూరు, చిల్లకూరు, నాయుడుపేట సింగిల్ విండో సొసైటీల ఆర్థిక బలోపేతం కోసం రెండేళ్ల క్రితం పెట్రోల్ బంకులు మంజూరు చేశారని వాటిని వాడుకలోకి తీసుకురానున్నామని చెప్పారు. సొసైటీల ఆధ్వర్యంలో జనరిక్ మందుల షాపులను అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. తక్కువ ధరలకే నాణ్యమైన మందులను అందిస్తామని పేర్కొన్నారు. మరోవైపు నాణ్యమైన ఎరువులను రైతులకు తక్కువ ధరలకే అందిస్తున్నట్లు చెప్పారు. రైతులకు పంట రుణాలతోపాటు తక్కువ వడ్డీలతో బంగారు రుణాలు ఇస్తున్నామని వివరించారు. ఆయా మండల పరిధిలోని రైతులు సింగిల్ విండో సొసైటీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతేకాకుండా మల్టీపర్పస్ గోదాములను రైతులకు త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. నిత్యం అందుబాటులో ఉంటూ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు.

తిరుపతి శరవేగంగా అభివృద్ధి చెందాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్..చిత్రంలో కలెక్టర్ వెంకటేశ్వర్

- కేంద్ర మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీనివాస్

తిరుపతి అర్బన్ : దేశంలోనే కీలకమైన ప్రదేశాల్లో తిరుపతి ఒకటని, అయితే ఆ స్థాయిలో అభివృద్ధి చెందడం లేదని కేంద్ర గృహ నిర్మాణ పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీనివాస్ కటికితల అభిప్రాయపడ్డారు. తిరుపతి పట్టణ సమగ్రాభివృద్ధిపై స్టేక్ హోల్డర్లతో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి ఇషా కాలియా, సాంకేతిక సలహాదారు రోహిత్ కక్కర్ , తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్యతో కలసి బుధవారం రాత్రి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి శర వేగంగా అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకతను గుర్తుచేశారు. తిరుమలకు వచ్చి దర్శనం చేసుకుని వెళ్లడంతోనే సరిపెట్టేస్తున్నారని పేర్కొన్నారు. అలా కాకుండా రెండు మూడు రోజులు ఈ ప్రాంతంలో యాత్రికులు ఉండేలా వసతులు కల్పిస్తే వారు ఉంటారని చెప్పారు. దేశంలో పెళ్లిళ్ల పరిశ్రమ ఏటా రూ.లక్ష కోట్లతో జరుగుతోందని పేర్కొన్నారు. అయితే తిరుమలలో పెళ్లిళ్లు జరుగుతున్నా ఆ స్థాయిలో సౌకర్యాలు ఉండడం లేదని పేర్కొన్నారు. తిరుపతి కేంద్రంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు బ్రిడ్జ్ కోర్సు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పలు విభాగాల డీన్‌లు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీలో పలు పీజీ కోర్సుల్లో నూతనంగా ప్రవేశాలు పొందిన విద్యార్థులకు వారం రోజుల పాటు నిర్వహించనున్న బ్రిడ్జ్ కోర్సును బుధవారం ప్రారంభించారు. వర్సిటీలోని చెలికాని అన్నారావు భవనంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అకడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్లా, స్కూల్ ఆఫ్ దర్శన్ డీన్ ప్రొఫెసర్ విష్ణుభట్టాచార్యులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ నూతనంగా పీజీ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు సంస్కృత భాషతోపాటు అందులో శాస్త్రీయ అంశాలు, శాస్త్రాల సమగ్ర జ్ఞానాన్ని బ్రిడ్జ్ కోర్సులో అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పంకజ్ కుమార్ వ్యాస్, సహాయక ఆచార్యులు డాక్టర్ యశస్వి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి తుడా:ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు తిరు పతి జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ పథకం కింద పలు పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ పరిధిలో 27 ఆశా కార్యకర్తల పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్న ట్లు జిల్లా వైద్య శాఖాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. వయస్సు 25 నుంచి 45 ఏళ్లలోపు ఉన్న మహిళా అభ్యర్థులు ఈనెల 16లోపు తమ పరిధిలోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లకు దరఖాస్తులను అందజేయాలని కోరారు.

ఆల్ ఇండియా వీసీ కాన్ఫరెన్స్‌లో ఎన్ఎస్‌యూ వీసీ



వీసీల కాన్ఫరెన్స్‌లో ఎన్ఎస్‌యూ వీసీ కృష్ణమూర్తి

తిరుపతి సిటీ : కర్ణాటకలోని ముద్దెనహాలి, సత్యగ్రామ, సత్యసాయి ప్రేమామృతం వేదికగా జరిగిన ఆల్ ఇండియా వైస్ ఛాన్సలర్స్ కాన్ఫరెన్స్‌లో జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు. భారత్ విశ్వగురువుగా వెలుగొందేందుకు తీసుకోవాల్సిన నూతన సంస్కరణలు, రీసెర్చ్ ఇన్నోవేషన్స్ ప్రోత్సహించడం, వర్సిటీల బలోపేతం తదితర అంశాలపై ఈ కాన్ఫరెన్స్‌లో విస్తృతంగా చర్చించారు.

అత్తపై హత్యాయత్నం కేసులో అల్లుడి అరెస్టు

నాయుడుపేటటౌన్ : అత్తపై హత్యాయత్నం చేసిన కేసులో అల్లుడు రవీంద్రనాథ్‌ను బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఆదిలక్ష్మి తెలిపారు. పట్టణంలోని అగ్రహారంపేట అరుంధతీ కాలనీలో నివాసం ఉంటున్న అత్త మహేశ్వరి ఇంటి వద్దకు బాలయపల్లి మండలం హస్తకావేరి గ్రామానికి చెందిన అల్లుడైన రవీంద్రనాథ్ వచ్చి ఈనెల 2వ తేదీ రాత్రి కత్తితో దాడి చేసి హత్యాయత్నం చేయడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. అల్లుడు రవీంద్రనాథ్ వివాహేతర సంబంధం పెట్టుకుని ఉన్నాడని అత్త నిలదీయడంతో కోపంతో అత్తపై దాడి చేసి హత్యాయత్నం చేసినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో నిందితుడిని పట్టుకుని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రెండిళ్లల్లో చోరీ

– 17 సవర్ల బంగారం అపహరణ



బీరువాను తెరిచి ఉంచిన నిందితులు

శ్రీకాళహస్తి : రెండు పక్క పక్క ఇళ్లల్లో గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడిన ఘటన రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాలిపేటలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు శ్రీకాళహస్తి పట్టణంలోని సాలిపేటలో మంగళవారం అర్ధరాత్రి ఎవరూ లేనిది గుర్తించి మునిరాజ ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న రెండు సవర్ల బంగారు, ఇంటి పత్రాలు, పిల్లలు చదువుకునే సర్టిఫికెట్లను దోచుకెళ్లారు. అదే విధంగా పక్కనే ఉన్న వీరస్వామి ఇంట్లో బీరువాలో ఉన్న 15 సవర్ల బంగారు, రూ.70 వేల నగదు, 150 గ్రాముల వెండి, విలువైన డాక్యుమెంట్లు చోరీకి గురైనట్లు తెలిపారు. రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి క్లూస్‌టీంతో పరిసరాల్లో సీసీ కెమెరాల ఫుటేజీ, వేలిముద్రలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లు చోరీకి గురి కావడంపై అనేక అనుమానాలకు తావిస్తోంది.

నల్లపరెడ్డి ఇంటిపై దాడి హేయం



జిలానీ బాషా

చిట్టమూరు : మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి ఇంటిపై దుండగులు చేసిన దాడి హేయమైన చర్య అని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ చైర్మన్ డాక్టర్ షేక్ జిలానీబాషా పేర్కొన్నారు. చిట్టమూరులో ఆయన బుధవారం మాట్లాడుతూ.. ప్రసన్న కుమార్ రెడ్డి తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి హయాంలో ఎంతో మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించి, పలువురికి ఆశ్రయమిచ్చిన జమీందారి కుటుంబమన్నారు. అలాంటి కుటుంబంపై రాజకీయ ముసుగులో గుండాల చేత ఇంటిపై దాడి చేయించడం తగదన్నారు. ఎన్నికల ముందు తర్వాత అధికార, ప్రతిపక్షంలో ఉన్న విమర్శలు, ఆరోపణలు సహజమన్నారు. అంతేకాని వ్యక్తిగతంగా తీసుకుని ఆస్తి, ప్రాణనష్టం కలిగే విధంగా ప్రవర్తించడం ప్రజాస్వామ్యంలో ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. దాడులకు దిగిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

13న ఐఐటీలో కామన్ ఇంకుబేషన్ సెంటర్

ఏర్పేడు : ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో ఈ నెల 13న కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ చేతుల మీదుగా కామన్ ఇంకుబేషన్ సెంటర్ ప్రారంభించనున్నట్లు ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కేఎస్ సత్యనారాయణ తెలిపారు. కేంద్ర మంత్రితో పాటు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి భరత్ ఈ కేంద్రాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.

ఆర్టీసీలో ఆన్‌కాల్డ్ డ్రైవర్లకు ఆహ్వానం

- రోజు 8 గంటల నుంచి 12 గంటల డ్యూటీ




సుధాకర్, ఆర్టీసీ మంగళం డిపో మేనేజర్

తిరుపతి అర్బన్ : ఆన్‌కాల్డ్ డ్రైవర్లకు ఆహ్వానం పలుకుతున్నట్లు మంగళం డిపో మేనేజర్ సుధాకర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. డిపోలో 43 మంది ఆన్‌కాల్డ్ డ్రైవర్లను భర్తీ చేయనున్నట్లు చెప్పారు. అయితే హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొంది 18 నెలలు పూర్తి అయిన వారు మాత్రమే అర్హులుగా పేర్కొన్నారు. రోజు 8 గంటల నుంచి 12 గంటల వరకు డ్యూటీ ఉంటుందని చెప్పారు. గంటకు రూ.100 వరకు జీతం ఉంటుందని స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 15 వరకు డిపోలో దరఖాస్తు ఇవ్వడానికి అవకాశం ఉందని వెల్లడించారు. వయస్సు 45 ఏళ్ల లోపు ఉండి, జిల్లాకు చెందినవారై ఉండాలన్నారు. ఆరోగ్యంగా ఉన్నట్లు మెడికల్ సర్టిఫికెట్స్, ఆధార్, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ సర్టిఫికెట్ జిరాక్స్‌ను అందించాలని చెప్పారు. అనంతరం రెండు రోజుల్లో ఎంపిక చేయడంతో పాటు వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తామని తర్వాత డ్యూటీల కేటాయింపు ఉంటుందని ఆయన వివరించారు.

శాశ్వత డ్రైవర్లకు మొండి చెయ్యేనా?

ఖాళీగా ఉన్న డ్రైవర్లను భర్తీ చేస్తే జీతాలు పెద్ద మొత్తంలో ఇవ్వాలని భావించిన కూటమి సర్కారు గంటకు రూ.100 చొప్పున చెల్లించి ఆన్‌కాల్ డ్రైవర్లను భర్తీ చేయడానికి జోరుగా చర్యలు చేపడుతోంది. దీంతో శాశ్వత డ్రైవర్ల భర్తీకి ప్రభుత్వం లేకుండా వారికి మొండిచెయ్యి చూపుతోందని పలువురు విమర్శిస్తున్నారు.

భార్య మృతిని తట్టుకోలేక భర్త ఆత్మహత్య



జితిన్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శివశంకర్

దక్కిలి : భార్య మృతిని తట్టుకోలేక మండలంలోని పాతనాలపాడు నక్కల కాలనీకి చెందిన భర్త జితిన్ (40) బుధవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ శివశంకర్ కథనం మేరకు.. పాతనాలపాడు నక్కల కాలనీకి చెందిన జితిన్ భార్య రెండు 2 నెలల కిందట మృతి చెందింది. దీంతో మనస్తాపానికి గురైన జితిన్.. తన భార్య సమాధి దగ్గరకు వెళ్లి పక్కనే ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతదేహానికి వెంకటగిరి ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసి కుటుంబీకులకు అప్పగించినట్లు చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

